# ముఖ్యమంత్రి కార్యాలయం

# తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 తేదిః 27-07-2015

అత్యంత పేదరికంలో మగ్గుతున్న ముస్లింల ఆర్థిక, సామాజిక, విద్యావిషయిక స్థితిగతులను సమగ్రంగా అధ్యయనం చేసి, తెలంగాణ ముస్లింల కోసం అవసరమైన కార్యక్రమాలు రూపొందించాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలోని ముస్లింల స్థితిగతులను అధ్యయనం చేయడానికి నియమించిన కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ పనితీరు, కార్యాచరణపై ముఖ్యమంత్రి క్యాంపు కార్యలయంలో సోమవారం సమీక్ష జరిపారు. ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, ఎం.పి. అసదుద్దీన్ ఓవైసి, కేంద్ర ప్రభుత్వం నియమించిన కుంద్ కమిటి సభ్యులు అమీరుల్లాఖాన్, ప్రొఫెసర్ అబ్దుల్ షాబాన్, తెలంగాణ ప్రభుత్వం నియమించిన కమిషన్ చైర్మన్ జి. సుదీర్, మైనారిటి సంక్షేమ శాఖ కార్యదర్శి ఉమర్ జలీల్ తదితరులతో కూలంకశంగా చర్చించారు. కేంద్ర ప్రభుత్వం నియమించిన సచార్ కమిటీ, కుంద్ కమిటీలు, మహారాష్ట్ర ప్రభుత్వం నియమించిన రహమాన్ కమిటి ఎలా అధ్యయనం చేసిందీ, దానికి అనుసరించిన పద్దతులు చర్చించారు. తెలంగాణ రాష్ట్రంలో అధ్యయనం ఎలా జరగాలి? ఏయే అంశాలను చర్చించాలి? ఏ ప్రాంతాల్లో పర్యటించాలి? ఎవరినుంచి అభిప్రాయాలు తీసుకోవాలి? గతంలో వివిద పద్దతుల్లో జరిపిన అధ్యయనాల్లో తేలిన అంశాలను ఎలా ఉపయోగించాలి? తదితర అంశాలు చర్చించారు.

తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 12శాతం ముస్లింలు వున్నారని, వారిలో ఎక్కువ శాతం నిరుపేదలే అని సిఎం చెప్పారు. తాను యూపిఏ ప్రభుత్వంలో వున్నప్పుడు సచార్ కమిటీ నియామకానికి కేంద్రంపై వత్తిడి తెచ్చానని వెల్లడించారు. దేశ వ్యాప్తంగా ముస్లింలకు సంబంధించిన అనేక అంశాలు బయటకు వచ్చాయని, ఇప్పుడు తెలంగాణలో జరిపే అధ్యయనం మరింత లోతుగా, శాస్త్రీయంగా జరగాలన్నారు. ప్రతి జిల్లాలో 3-4 నియోజక వర్గాల్లో పర్యటించాలని, పట్టణ, గ్రామీణ ముస్లింలను కలవాలని చెప్పారు. వారి స్థితిగతులపై

వివరాలు సేకరించడంతో పాటు, జీవన విధానంపై ఫోటోలు, వీడియోలు తీయాలని సూచించారు. మూడు, నాలుగు ఏజెన్సీలలో సర్వే జరపాలన్నారు. రాజకీయ పార్టీలు, ఇతర సంస్థలు, ముస్లిం సమాజాల నుంచి వినతులు తీసుకోవాలన్నారు. జిల్లాల్లో పర్యటించి నేరుగా ముస్లింలతో మట్లాడాలని, వారి జీవన ప్రమాణాలు పెంచడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో వారినుంచే అభిప్రాయాలు తీసుకోవాలని ఆదేశించారు. అధ్యయనం పూర్తయిన తర్వాత ముస్లింల కోసం చేయాల్సిన దీర్ఘకాలిక, మధ్యకాలిక, స్వల్పకాలిక కార్యక్రమాలను ప్రతిపాదించాలన్నారు. తెలంగాణలో చాలా ముస్లిం కుటుంబాలు పేదరికంలో వున్నాయని, నెలకు వెయ్యి రూపాయలు కూడా సంపాదన లేని వారుండడం బాధాకారమన్నారు. ఎన్నికల సందర్భంగా ముస్లిం ప్రజల జీవన స్థితిగతుల్లో మార్పు తెస్తామని హామి ఇచ్చామని, వాటిని వందకు వంద శాతం అమలు చేస్తామని చెప్పారు. బడ్జెట్ కెటాయింపులు పెంచడంతో పాటు, షాది ముబారక్, హాస్టళ్లు, రెసిడెన్షియల్స్, ఏర్పాటు లాంటి చర్యలు తీసుకున్నామన్నారు. అయినా చాలా కార్యక్రమాలు చేయాల్సి వుందన్నారు. జనాభా ప్రకారం పేద ముస్లింలకు రిజర్వేషన్ కల్పించడానికి తమిళనాడు, కర్ణాటక లాంటి రాష్ట్రల్లో అవలంభించిన పద్ధతుల్లో అనుసరిస్తామన్నారు. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ నివేదిక రాగానే ముస్లింల కోసం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తామని వెల్లడించారు.

**కమిషన్ లో మరో ఇద్దరు సభ్యులు**

ప్రభుత్వ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సుధీర్ నేతృత్వంలోని కమిషన్ లో కుంద్ కమిటిలో పని చేసిన అనుభవం వున్న అమీరుల్లాఖాన్, అబ్దుల్ షాబాన్ లను సభ్యులుగా నియమించారు. అమీరుల్లాఖాన్ మాజీ ఐఎఎస్ అధికారి కాగా, షాబాన్ గతంలో మహారాష్ట్ర ప్రభుత్వం నియమించిన రహమాన్ కమిటి సభ్యుడు. పూర్తిస్థాయి కమిషన్ ఏర్పాటు జరిగనందున ఆగస్టు మొదటి వారంలో సమావేశం ఏర్పాటు చేసుకొని కార్యాచరణ రూపొందించుకోవాలని సిఎం చెప్పారు.

.................................................................................................................

సిపిఆర్ఓ టు సిఎం